DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
మంగళవారం, నవంబరు 14, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## 17 నుంచి తెలంగాణకు రాహుల్...



హైదరాబాద్, నవంబర్ 14: కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీ మళ్లీ తెలంగాణ పర్యటన కోసం రానున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని మరింత దూకుడుగా చేస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీకి చెందిన అగ్రనేతల పర్యటనలు ఉండేలా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు వేస్తోంది. ఈ క్రమంలోనే ఒకేరోజు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సమావేశాలు ఉండేలా కూడా ప్లాన్ చేస్తూ ఉంది.ఈసారి రాహుల్ గాంధీ వరుసగా 6 రోజులపాటు తెలంగాణలో పర్యటించనున్నారు. ఈనెల 17న రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి 23వ తేదీ వరకూ ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 17 నుంచి రాహుల్ గాంధీ.. అదే రోజు పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో ప్రచారం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

# జానారెడ్డి మాట మీద నిలబడలేదు.. గులాబీ కండువా కప్పుకోలేదు: కేసీఆర్

హాలియా (వాయిస్ టుడే): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డిపై ముఖ్యమంత్రి కేసీఆర్ మండిపడ్డారు. రెండేండ్లలో కాదు.. నాలుగేండ్లలో 24 గంటల కరెంట్ ఇస్తే.. నేను కాంగ్రెస్ పార్టీ కండువా తీసి, గులాబీ కండువా కప్పుకుంటానని జానారెడ్డి చెప్పారు. ఏడాదిన్నరలోనే 24 గంటల కరెంట్ ఇచ్చాం. కానీ జానారెడ్డి మాట మీద నిలబడలేదు.. ఆయన పార్టీ మారలేదు.. గులాబీ కండువా కప్పుకోలేదు అని కేసీఆర్ గుర్తు చేశారు. హాలియాలో ఏర్పాటు చేసిన నాగార్జున సాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నుడూ కూడా ధైర్యంతో పని చేసి అన్ని వర్గాలను ఆదుకునే పని చేయలేదు. జానారెడ్డి పెద్ద నాయకుడిగా ఉండే. మినిస్టర్‌గా ఉండే. అపోజిషన్ లీడర్‌గా ఉండే. నేను సీఎం అయిన ప్రారంభంలో కరెంటో కష్టాలు ఘోరంగా ఉండే. మీకు అప్పుడప్పుడు సాగర్ నీళ్లు వచ్చేవి. మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల ప్రజలు వలసపోయారు. పశువులకు గడ్డి లేక కబేళాలకు అమ్మేసి అన్నమో రామచంద్ర అని పొట్ట చేతబట్టుకుని బతుకపోయేది. దుర్భరంగా ఉండే. చాలా కష్టపడి మూడు నాలుగు నెలలు ఆర్థిక నిపుణులతో చర్చించి ముందుకు వెళ్లామని కేసీఆర్ తెలిపారు.

కచ్చితంగా కరెంట్ విషయంలో మంచి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించాం. నేనే అసెంబ్లీలో మాట్లాడుతూ.. రెండేండ్లలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తానని ప్రకటన చేశాను. ఆనాడు జానారెడ్డి అపోజిషన్ లీడర్‌గా ఉండే. కేసీఆర్ రెండేండ్లలో కాదు.. నాలుగేండ్లలో కరెంట్ ఇచ్చినా నేను కాంగ్రెస్ కండువా తీసి గులాబీ కండువా కప్పుకుని మీ కార్యకర్తలా పని చేస్తానని మాట్లాడిండు. కానీ ఏడాదిన్నర లోపే 24 గంటల కరెంట్ ఇచ్చాను. నేను సక్సెస్ అయ్యాను. జానారెడ్డి మాట మీద నిలబడలేదు. ఆయన పార్టీ మారలేదు, గులాబీ కండువా కప్పుకోలేదు. గత ఎన్నికల్లో ఉల్టా భగత్ మీద నిలబడ్డారు. మీరంతా జానారెడ్డికి తగిన బుద్ధి చెప్పారు. ఇప్పుడు కూడా పార్టీల వైఖరి గురించి ఆలోచించి నిర్ణయం చేయాలి. అప్పుడే మేలు జరుగుతది. నిజంగా ఎవరి చేతుల్లో ఈ రాష్ట్రం ఉంటే బాగుంటుందో ఆలోచించాలి. మీ నిర్ణయం చాలా జాగ్రత్తగా ఉండాలి అని కేసీఆర్ సూచించారు.

జానారెడ్డి మంత్రిగా ఉండే.. పెద్ద నాయకుడిగా ఉండే.. ఇక ఇప్పుడు కూడా కల కంటున్నాడు ముఖ్యమంత్రి అయితా అని. కానీ ఆయన హయాంలో నాగార్జున సాగర్‌లో ఓ డిగ్రీ కాలేజీ కూడా దిక్కు లేకుండే. నోముల భగత్ ఎమ్మెల్యే అయ్యాక డిగ్రీ కాలేజీ మంజూరు చేశాను. హాలియాలో 50 పడకల దవాఖానా దిక్కు లేకుండే. అది కూడా భగత్ చేయించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గం పరిధిలో రెండు లిఫ్ట్ గిరిగేషన్ పనులు ప్రారంభమయ్యాయి. ఎనిమిది నెలల్లో పూర్తవుతాయి. నేనే వచ్చి ప్రారంభం చేస్తాను అని కేసీఆర్ తెలిపారు.





## మందికి పుట్టిన పిల్లలను తమ పిల్లలుగా చెప్పుకునే రకం గంగుల

కరీంనగర్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలది భూకబ్జాలు, అవినీతి లొల్లి అని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఇసుక కుప్పలు కన్పిస్తే బీఆర్ఎస్ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారని... ఖాళీ జాగాలు కన్పిస్తే కబ్జాలు చేస్తున్నారన్నారు. యువతను మంత్రి గంగుల కమలాకర్ గంజాయి మత్తులో ముంచుతున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు గల్లీలో తిరుగుతుంటే జనమే నిలదీస్తున్నారన్నారు. ఓట్ల కోసం ఓటుకు రూ.10 వేలు పంచేందుకు సిద్ధమయ్యాడని బండి సంజయ్ పేర్కొన్నారు. లక్ష సెల్ ఫోన్లు పంచేందుకు గంగుల కమలాకర్ సిద్ధమయ్యాడని పేర్కొన్నారు. గంగుల ఓటమి ఖాయమని కేసీఆర్‌కు ఎప్పుడో తెలుసన్నారు. అందుకే ఒవైసీ వద్ద మోకరిల్లి పచ్చజెండా పట్టుకున్నాడన్నారు. భూకబ్జాలు తప్ప కాంగ్రెస్ చేసిందేమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. మందికి పుట్టిన పిల్లలను తమ పిల్లలుగా చెప్పుకునే రకం గంగుల అని విమర్శించారు. గంగుల కమలాకర్ మళ్లీ గెలిస్తే జీతాలు, ఫించన్లు రావన్నారు. మా అత్త చనిపోయిందని ఇంటికొస్తే కేసీఆర్, గంగుల కుట్ర చేసి తనను జైలుకు పంపారని బండి సంజయ్ తెలిపారు.

# ఎంపీ టూ ఎమ్మెల్యే... బరిలో ఏడుగురు

## బరిలోకి తమ పార్టీల తరపున ఏడుగురు ఎంపీలు

హైదరాబాద్, నవంబర్ 14, (వాయిస్ టుడే): ఎంపీలుగా ఉన్న ఏడుగురు అసెంబ్లీ బరిలో దిగారు. సాధారణగా ఏడు నియోజకవర్గాలు కలిపి ఒక ఎంపీ స్థానం. అయితే ఎంపీ కన్నా ఎమ్మెల్యే మాటే ఎక్కవ చెల్లుబాటు అవుతుంది. పైగా తెలంగాణ ఎన్నికలు అత్యంత కీలకం. అందుకే ఏకంగా ఏడుగురు ఎంపీలు తమ పార్టీల తరపున బరిలోకి దిగారు.తెలంగాణ ఎన్నికల సమరంలో మొదటి అంకమైన నామినేషన్ల ఘట్టం పూర్తయే సరికి ఏడుగురు ఎంపీలు బరిలో మిగిలారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న ముగ్గురు ఎంపీలు, బీజేపి నుంచి ఎన్నికైన నలుగురిలో ముగ్గరు పోటీ చేస్తున్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ నుంచి మాత్రం ఒకరు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. టీ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం తన సొంత నియోజక వర్గమైన కొడంగల్‌తో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీలో ఉన్న కామారెడ్డి నుంచి బరిలో దిగారు. మాజీ పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ నుంచి పోటీలో నిలబడ్డారు. 2018 శాసన సభ ఎన్నికల్లో ఆయన హుజూర్ నగర్ నుంచి గెలిచినప్పటికి, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఆదేశం మేరకు నల్గోండ నుంచి పోటీ చేసి గెలుపొందడంతో అసెంబ్లీకి రాజీనామా చేశారు. అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి తన సతీమణి పద్మావతి రెడ్డిని హుజూర్‌నగర్ నుంచి బరిలోకి దించగా బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైది రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇక మరో కాంగ్రెస్ నేత కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొం



పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి విజయం సాధించారు. ప్రస్తుతం నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో నిలిచారు. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కూడా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో ఓడిపోయారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేసి బి.వినోద్ కుమార్‌పై గెలుపొందారు. 2019 ఎంపీ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసిన ధర్మపురి అర్వింద్ కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితపై విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన జగిత్యాల జిల్లా కోరుట్ల అసెంబ్లీ నుంచి పోటీలో నిలిచారు. మరో బీజేపీ ఎంపీ సోయం బాబురావు 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తాజాగా ఆయన బోథ్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి బరిలోకి దిగారు. బీఆర్ఎస్ నుంచి మెదక్ ఎంపీగా గెలిచిన కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రస్తుతం దుబ్బాక అసెంబ్లీ నుంచి పోటీలో నిలబడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఆయనపై ఓ వ్యక్తి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన వీల్ చైర్‌లోనే వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి మొత్తం ఏడుగురు ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఇందులో ఎంతమంది గెలిచి తమ ఎంపీ పదవి వదులుకుంటారో డిసెంబర్ 3న తేలి పోనుంది.



## మరో 6 నెలల్లో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఉండదో కూడా తెలియదు

### కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే చంద్రప్ప

చేవెళ్ల (వాయిస్ టుడే): మరో ఆరు నెలల్లో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఉండదో కూడా తెలియదని, ఆ పార్టీలో 5 గ్రూపులు ఉన్నాయని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే చంద్రప్ప ఎద్దేవ చేశారు. మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్రంలోని చేవెళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 5 కేజీల బియ్యం అట్టర్ ఫ్లాప్ అయింది. విద్యానిధి కింద 3 వేలు ఇస్తామన్నారు.. ఇవ్వలేదు. ప్రతి మహిళకు ప్రతి నెల 2 వేలు ఇస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన 5 గ్యారెంటీలు ఇంప్లిమెంట్ చేయట్లేదు. ఇవన్నీ చెప్పి 6 నెలలు దాటింది. ఇక తెలంగాణ ప్రభుత్వం సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే అన్ని సకాలంలో సాధ్యమవుతాయి. బీజేపీ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మంచి జరుగుతుందని ప్రజలు కూడా భావిస్తున్నారు. ప్రజలు మరోసారి మోసపోవద్దు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఎలా ఉందో మీ స్నేహితులను అడిగి తెలుసుకోండి. కాంగ్రెస్ పార్టీ నేతలను గ్యారెంటీలు ఇవ్వమని ఎవరు అడిగారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జేడీఎస్, బీజేపీ 25 ఎంపీ స్థానాలు గెలుస్తుంది. బీఆర్ఎస్ అట్టర్ ఫ్లాప్ అయింది. ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరు. ప్రభుత్వ భూములు కూడా అమ్ముకుంటున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం బీజేపీదే. బీజేపీ పార్టీ చేవెళ్ల అభ్యర్థి కేఎస్ రత్నంకు చాలా మంచి పేరుంది" అని ఎమ్మెల్యే చంద్రప్ప పేర్కొన్నారు.

# పాపాల భైరవుడు కేసీఆర్ వంద తప్పులు పూర్తయ్యాయి

## స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



జనగామ(వాయిస్ టుడే): బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి గురించి తాను కొత్తగా చెప్పాల్సిన అవసరం ఏం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎద్దేవ చేశారు. మంగళవారం నాడు స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.."ఒక ఆడబిడ్డ ఇక్కడ పోటీ చేస్తుంటే రాజయ్య, శ్రీహరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. శ్రీహరి సంగతి రాజయ్య చెప్పిండు... రాజయ్య సంగతి శ్రీహరి చెప్పిండు..ఇద్దరూ ఉప ముఖ్యమంత్రిగా పని చేసి ఉద్యోగం ఊడగొట్టుకున్నోల్లే. ఇద్దరి జాతకాలు తెలుసు కాబట్టే ఉద్యోగం ఇచ్చి మధ్యలోనే కేసీఆర్ వీళ్లిద్దరి పదవులను ఊడగొట్టిండు. కేసీఆర్‌కే వీళ్లపై నమ్మకం లేదు.. అలాంటిది ప్రజలు ఎలా నమ్ముతారు. స్టేషన్ ఘనపూర్‌కు వందపడలకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ తెచ్చే బాధ్యత నాది. పదేళ్లలో కేసీఆర్ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆరుగురు మహిళలకు టికెట్లు ఇస్తే.. కాంగ్రెస్ పార్టీ 12 మంది మహిళలకు టికెట్లు ఇచ్చింది. పదేళ్లలో ప్రజలకు కేసీఆర్ చేసిందేం లేదు. తన కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చుకుండు.. దద్దమ్మ దయాకర్ రావును మంత్రిని చేసిండు. సర్పంచులు బిల్లులు రాక ఆత్మహత్య చేసుకుంటుంటే.. ఈ దద్దమ్మ దయాకర్‌రావు వాళ్లను ఖాళీ సీసాలు అమ్ముకోమంటారా? రాష్ట్రంలో ఆడబిడ్డలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి కేసీఆర్ పాలనలో దాపురించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుంది. లేకపోతే 30లక్షల మంది నిరుద్యోగ యువకులు అడవి బాట పట్టే పరిస్థితి వస్తుంది. నిరుద్యోగ యువతి ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుంటే.. కేసీఆర్ ప్రభుత్వం ఆ కుటుంబం పరువును బజారుకీడ్చింది. శిశుపాలుడి వంద తప్పులు పూర్తయ్యాక శిరచ్ఛేదనం జరిగింది. పాపాల భైరవుడు కేసీఆర్ వంద తప్పులు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో శిరచ్ఛేదనం జరగాల్సిందే.. బీఆర్ఎస్ ప్రభుత్వం నేల కూలాల్సిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ప్రతీ నెలా రూ.2500 అందిస్తాం. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తాం. రైతులకు, కౌలు రైతులకు ప్రతీ ఏటా ఎకరాకు రూ.15వేలు అందిస్తాం. రైతు కూలీలకు ప్రతీ ఏటా రూ.12వేలు అందిస్తాం. ఆనాడు కాంగ్రెస్ పార్టీ 9 గంటల ఉచిత కరెంట్ ఇచ్చింది. ఇప్పుడు 24గంటల నాణ్యమైన ఉచిత కరెంటు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్‌ది. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. చేయూత పథకం ద్వారా రూ.4వేలు పెన్షన్ అందిస్తాం. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందించే బాధ్యత కాంగ్రెస్‌ది. స్టేషన్ ఘనపూర్‌లో ఇందిరమ్మను 25వేల మెజార్టీతో గెలిపించండి.. ఇక్కడ ఇందిరమ్మను గెలిపిస్తే అక్కడ సోనియమ్మను గెలిపించినట్లే" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.



## ఖమ్మం జిల్లాలో 10 కి 10 గెలుస్తాం

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 10కి 10 స్థానాలు గెలుస్తుందని మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి అన్నారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న కాంగ్రెస్ సునామిలో కేసీఆర్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయం. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓటమి భయంతో మా కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఖబర్ధార్. నువ్వు ఓడిపోయిన తక్షణం అక్కడి నుంచి పారిపోతావ్. పువ్వాడ అజయ్ పాముకు పాలు పోస్తే కాటు వేసే రకం. పువ్వాడ అజయ్ కాంగ్రెస్ కార్యకర్తలను ఎంత ఇబ్బంది పెడితే అంత బలంగా ముందుకు వస్తారు. బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఒకటే. ఈ పార్టీలు మతతత్వ రాజకీయాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రచారం చేస్తా.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దాడులు చేస్తున్నాయి. మీరు దాడులు చేస్తారని మేము పైసలు ఇంట్లో పెట్టుకొని కూర్చుంటామా. బీఆర్ఎస్‌లో ఎంతమంది కోవర్టులు ఉన్నారో మాకు తెలుసు. మాకు కోవర్టులు ఉన్నారు. వారికి కూడా కోవర్టులు ఉన్నారు" అని రేణుకా చౌదరి అన్నారు.

## రూపాయి జీతంతో సేవ చేస్తా... ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి




కామారెడ్డి (వాయిస్ టుడే): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం గుడిమెట్, కరక్ వాడి, బూర్గుల్ గ్రామాల్లో మదన్మోహన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో జాజాల సురేందర్ ఓటమి ఖాయమన్నారు. ప్రజలను, కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన సురేందర్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యేగా సురేందర్ ఎల్లారెడ్డికి చేసింది శూన్యమని విమర్శించారు. రూ.30 కోట్లకు ఎల్లారెడ్డి ఆత్మగౌరవాన్ని కేసీఆర్‌కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు దక్కాల్సిన కాంట్రాక్టులను 40 శాతం కమిషన్‌కు ఆంధ్ర కాంట్రాక్టర్లకు అమ్ముకున్నారన్నారు. ఒక రూపాయి జీతంతో ప్రజలకు సేవ చేస్తానని.. ఎల్లారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని.. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, సైడ్ కాలువలు నిర్మిస్తామని మదన్మోహన్ హామీ ఇచ్చారు.



## బజార్‌ఘాట్ ఘటనలోకి మరోసారి ఎంటరైన క్లూస్, ఫోరెన్సిక్ టీమ్స్

హైదరాబాద్ (వాయిస్ టుడే): బజార్ ఘాట్ అగ్ని ప్రమాద ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనాస్థలంలో మరోసారి క్లూస్ టీం.. ఫోరెన్సిక్ టీం.. ఎంటరై ఆధారాలు సేకరిస్తున్నాయి. రోడ్డుపై ఆయిల్ పారుతూ ఉండడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది మట్టి పోసింది. బిల్డింగ్‌లోని మిగిలిన ఆయిల్ డ్రమ్ములను జీహెచ్ఎంసీబయటకి తరలించింది. మరోవైపు బిల్డింగ్ పటిష్టతను జేఎన్‌టీయూ బృందం పరిశీలించనుంది. అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంటుకు దగ్గరలో రమేష్ జైస్వాల్ షాప్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. షాప్‌లో రికార్డులను తనిఖీ చేయడంతోపాటు కార్యకలాపాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.





## బరిలో 2,898 మంది.. ముగిసిన నామినేషన్ల పరిశీలన

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 606 నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పరిశీలన తర్వాత ఎన్నికల బరిలో 2,898 మంది అభ్యర్థులు బరిలో ఉండనున్నారు. ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. ఈ నెల 3న ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే.

ఈ నెల 10 వరకు నామినేషన్ల కార్యక్రమం కొనసాగింది. 4798 మంది అభ్యర్థులు 5716 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నిన్నటి నుంచి నామినేషన్ల పరిశీలన కొనసాగింది. అత్యధికంగా గజ్వేల్‌లో 114 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆ తర్వాత మేడ్చల్‌లో 67, కామారెడ్డిలో 58, ఎల్బీనగర్‌లో 50, కొడంగల్‌లో 15 మంది, బాల్కొండలో 9 బరిలో ఉండగా.. అత్యల్పంగా నారాయణపేటలో 7 మంది అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు.

# ఎన్నికల బరిలో 100 కొత్త ముఖాలు

హైదరాబాద్, నవంబర్ 14,(వాయిస్ టుడే): 2014 రాష్ట్ర విభజన తరువాత ఉద్యమ తెలంగాణ నినాదంతో అన్ని పార్టీలు పోటీ చేశాయి. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కంటే.. తెచ్చిన కెసిఆర్ కే తెలంగాణ ఓటర్ జై కొట్టాడు. అప్పట్లో ఉద్యమంలో పనిచేసిన నాయకులకు, కొత్త తరం నేతలకు కేసీఆర్ అవకాశం ఇచ్చారు. ఈసారి తెలంగాణ ఎన్నికల్లో సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. ఎక్కడ చూసినా కొత్త అభ్యర్థులే బరిలో కనిపిస్తున్నారు. ఎన్నారైలు, డాక్టర్లు, ప్రభుత్వ మాజీ ఉద్యోగులు, నాయకుల వారసులు రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అదృష్టం కలిసి వస్తే ఎమ్మెల్యేలుగా అవతరించనున్నారు. గత రెండు ఎన్నికల్లో కనిపించని ఈ నవతరం.. ఈసారి కనిపిస్తుండడం.. అటు ఓటర్లలో సైతం ఒక రకమైన వాతావరణం కనిపిస్తుండడంతో.. అధికార బీఆర్ఎస్ కలవరపాటుకు గురవుతోంది. దాదాపు అన్ని పార్టీల నుంచి 100 మందికి పైగా కొత్తవారి ఎన్నికల బరిలో దిగడం విశేషం. 2014 రాష్ట్ర విభజన తరువాత ఉద్యమ తెలంగాణ నినాదంతో అన్ని పార్టీలు పోటీ చేశాయి. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కంటే.. తెచ్చిన కెసిఆర్ కే తెలంగాణ ఓటర్ జై కొట్టాడు. అప్పట్లో ఉద్యమంలో పనిచేసిన నాయకులకు, కొత్త తరం నేతలకు కేసీఆర్ అవకాశం ఇచ్చారు. అప్పట్లో అది వర్కౌట్ అయింది.




టిఆర్ఎస్ గెలుపునకు కారణమైంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ సీనియర్లతో పోటీ చేయించింది. కానీ ఓటర్లు తిరస్కరించారు. సెటిలర్స్ ఉన్నచోట్ల తెలుగుదేశం పార్టీ ప్రభావం చూపింది. కానీ 2018కి సీన్ మారింది. కొత్త వ్యూహంతో అన్ని పార్టీలు పోటీ చేశాయి. కానీ కెసిఆర్ ఎత్తుగడల ముందు నిలబడలేకపోయాయి. 2019 ఎన్నికల్లో కెసిఆర్ బంగారు తెలంగాణ నినాదాన్ని ఎంచుకున్నారు. ఉద్యమ నాయకులను పక్కన పెట్టారు. అసలు ఉద్యమంతో సంబంధంలేని కాంగ్రెస్, టిడిపి నాయకులను చేరదీశారు. బంగారు తెలంగాణను సాధించుకుందామని.. తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కొంతమంది నాయకులు అవసరమని చెప్పి టిక్కెట్లు కట్టబెట్టారు. ప్రజలకు అదే విషయాన్ని చెప్పుకొచ్చారు. ప్రజామోదం పొంది రెండోసారి అధికారంలోకి రాగలిగారు. అయితే గత రెండు ఎన్నికల్లో విజయం సాధించినంత ఈజీ.. ఈసారి కాదని కెసిఆర్ కు తెలుసు. అదే సమయంలో గత రెండు ఎన్నికల్లో దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చింది. ఎక్కడికక్కడే యువతరాన్ని ఎంపిక చేసింది. సామాజిక, ఆర్థికంగా బలమైన అభ్యర్థులను బరిలోదించింది. ఈ క్రమంలో యువనాయకత్వాన్ని ఎంపిక చేయడం విశేషం. అటు భారతీయ జనతా పార్టీ సైతం వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించి టికెట్లు కట్టబెట్టింది. బిఆర్ఎస్ మాత్రం సిట్టింగ్లకే నమ్ముకుంది. మెజారిటీ సీనియర్ నేతలకి టిక్కెట్లు ఇచ్చింది. విపక్షాలు మాత్రం నవతరానికి పెద్దపీట వేశాయి. అందుకే గత రెండు ఎన్నికల్లో చూడని చిత్ర విచిత్రాలు ఎన్నికల్లో కనిపిస్తున్నాయి. అసెంబ్లీకి ఎన్నికైన వారిలో యువకులే అధికంగా వస్తారన్న టాక్ వినిపిస్తోంది. మరి తెలంగాణ ఓటర్ నాడీ ఎలా ఉందో చూడాలి.

## హైదరాబాద్ అభివృద్ధిలో.. ఇప్పటివరకు మీరు చూసింది ట్రైలర్ మాత్రమే



హైదరాబాద్ (వాయిస్ టుడే): హైదరాబాద్ అభివృద్ధిలో ఇప్పటివరకు మీరు చూసింది ట్రైలర్ మాత్రమేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ భేటీ జరిగింది. ఈభేటీలో కేటీఆర్ పాల్గొని మాట్లాడుతూ.. BRS హయాంలో తెలంగాణ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. BRS పాలనలో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉంది. ప్రాధాన్యత క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. కొత్త రాష్ట్రంలో సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలను రాష్ట్రంలో పరిష్కరించుకున్నాం. ORR, RRR మధ్య సరికొత్త హైదరాబాద్ తయారవుతుంది. త్వరలో ప్రతిరోజూ తాగునీరు ఇచ్చేలా చూస్తాం. భవిష్యత్‌లో నిరంతరాయ తాగునీరు ఇచ్చేలా చూస్తాం. కరోనా కాలంలోనూ ఐటీ రంగంలో విశేష అభివృద్ధి సాధించాం. ఐటీ ఉద్యోగాల కల్పనలో రెండేళ్లుగా బెంగళూరును అధిగమించాం. రాష్ట్రాభివృద్ధికి స్టేబుల్ గవర్నమెంట్..ఏబుల్ లీడర్‌షిప్ అవసరం. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్కడ పరిస్థితి దారుణంగా మారింది" అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## రన్‌వేపైకి వచ్చిన వీధి కుక్క..

### ల్యాండ్ అవ్వకుండానే వెనుదిరిగిన విస్తారా విమానం



గోవాలోని దబోలిమ్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేపైకి వీధి కుక్క రావడంతో విస్తారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ ల్యాండ్ అవ్వకుండానే వెనుదిరిగింది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. విస్తారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన యూకే 881 ఫ్లైట్ కర్ణాటక రాజధాని బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం మధ్యాహ్నం 12:55 గంటలకు బయలుదేరింది. ఆ విమానం 2 గంటలకు గోవాలోని దబోలిమ్ విమానాశ్రయం లో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ల్యాండ్ కావడానికి కొద్దిసేపు ముందు రన్‌వేపై వీధి కుక్కను గుర్తించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. వెంటనే పైలట్‌ను అప్రమత్తం చేశారు. కాసేపు ల్యాండ్ చేయకుండా పైలట్‌ను ఆపినట్లు గోవా విమానాశ్రయం డైరెక్టర్ ఎస్‌వీటీ ధనుంజయరావు తెలిపారు.

అయితే, కాసేపటికి విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. 3:05 గంటల ప్రాంతంలో కెంపెగౌడ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. విమానం మళ్లీ బెంగళూరు నుంచి 4:55 గంటలకు బయలుదేరి 6:15 గంటలకు గోవా చేరుకుందని ఆయన వివరించారు. ఆ సమయంలో విమానంలో 100 మంది ప్రయాణికులు ఉన్నట్లు చెప్పారు. విమానం గోవాలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు వెల్లడించారు.

## ఎందరో బలిదానాన్ని ఒకే ఒక్క కుటుంబం స్వార్థం కోసం వాడుకుంటోంది

### పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం (వాయిస్ టుడే): తిరుమలాయపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఎంతో మంది కవులు, కళాకారులు, ఉద్యమకారులు, విద్యార్థులు బలిదానం ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రం కేవలం ఒకే ఒక్క కుటుంబం స్వార్థం కోసం వాడుకుంటోందని పేర్కొన్నారు. 2014కు ముందు కేసీఆర్ ఆర్థిక పరిస్థితి ఏంటి?.. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఆర్థిక పరిస్థితి ఏంటనేది ప్రజలు ఆలోచించాలని పొంగులేటి పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇంద్రలోకాన్ని చూపిస్తూ తెలంగాణ యాసలో ప్రజలను మభ్య పెడుతుంటాడన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని రెండు సార్లు కేసీఆర్‌కు అధికారం అప్పగిస్తే ధనిక రాష్ట్రంగా ఉన్న రాష్ట్రాన్ని ఐదున్నర లక్షల కోట్ల అప్పుల పాలు చేశాడన్నారు. కాళేశ్వరం పేరుతో ఐదున్నర లక్షల కోట్లలో ప్రజల సొమ్ము కేసీఆర్ దొంగిలించాడని పొంగులేటి తెలిపారు. అలాంటి కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామా? అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మన కష్టాలు తీరుతాయని పొంగులేటి తెలిపారు.




## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం.. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బొలెరో

మెదక్ (వాయిస్ టుడే): రామాయంపేట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తెల్లవారుజామున రోడ్డు పక్కన ధాన్యం బస్తాలతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టింది. బొలెరో వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. బొలెరో వాహనం నడుపుతున్న డ్రైవర్ రాహుల్ శ్యాం సావ్య( 20) మృతి చెందగా... మరొకరికి గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు బయటపడ్డారు.

# బీజేపీకి మాదిగల వర్గీకరణ ఎఫెక్ట్...

హైదరాబాద్, నవంబర్ 14, (వాయిస్ టుడే): ఎస్సీ, ఎస్టీ జాబితా నుంచి కొన్ని కులాలు, తెగలను తొలగించాలనేది వివాదంగానే ఉంది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అనేక రకాల సిఫారసులు, జడ్జిమెంట్లు వెలువడ్డాయి. పార్లమెంటు ద్వారా రాజ్యాంగంగంలోని ఆర్టికల్ 341కు సవరణ జరిగితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టం చేశాయి. మరోవైపు రాష్ట్రాలకు ఉన్న కొన్ని విచక్షణాధికారాలను వినియోగించుకుని అమలు చేయవచ్చంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలతోపాటు విపక్షాలు సైతం ఎన్నికల సందర్భంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. బీజేపీ తన 2014 మేనిఫెస్టోలోనే వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించింది. వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో అఖిలపక్షాన్ని, ప్రత్యేక బృందాన్ని ఢిల్లీ తీసుకెళ్లి అప్పటి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం తీర్మానం చేసి పంపింది. దళితుల్లో సబ్ గ్రూపులుగా ఉన్న కులాలకు రిజర్వేషన్ల ప్రయోజనాలపై 1965 జూన్ 1న కేంద్ర ప్రభుత్వం అప్పటి సోషల్ జస్టిస్ మంత్రిత్వశాఖ కార్యదర్శి బీఎన్ లోకూర్ అధ్యక్షతన అడ్వయిజరీ కమిటీని నియమించింది. మూడునెలల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఎస్సీ, ఎస్టీ జాబితాలో ఉన్న కొన్ని కులాలు, తెగలు సాంఘికంగా, ఆర్థికంగా బలపడినందున రిజర్వేషన్ సహా పలు ప్రభుత్వ ఫలాలను అందుకోవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలు ఆయా సంఘాల




నుంచి కమిటీకి రాతపూర్వకంగా వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో మాలలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్ వచ్చింది. అప్పటి ఎంపీహెచ్‌సీ హెడా సైతం మాల కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని కమిటీకి వివరించారు. దీనికి కమిటీ నిరాకరించడంతో పలు కారణాలను ఆగస్టు 25, 1965న సమర్పించిన నివేదికలో వివరించింది. హక్కుల సాధన కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పేరుతో 1994 జూలై 7న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పడిన సంఘం ఆ తర్వాత రాజకీయ పార్టీగా అవతరించింది. మాదిగలకు సైతం రిజర్వేషన్లలో తగిన ప్రాధాన్యత లభించాలన్న ఏకైక లక్ష్యంతో ఇప్పటికీ కొట్లాడుతూనే ఉంది. జనాభా రీత్యా ఈ సెక్షన్‌ను దూరం చేసుకోకుండా రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. హైదరాబాద్‌లో గాంధీ భవన్ కొంత కాలంపాటు మాదిగల దీక్షలకు నిలయంగా మారింది. గతంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హైదరాబాద్ పర్యటనను పురస్కరించుకుని ఈ డిమాండ్‌ను బలంగా వినిపించాలన్న ఉద్దేశంతో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు గాంధీ భవన్‌ను ముట్టడించి పెట్రోలు బాంబులు విసరడంతో సెక్యూరిటీగా ఉన్న పోలీసు అధికారితో పాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పలువురు చనిపోయారు. ఎస్సీలకు రాజ్యాంగం ద్వారా అందుతున్న రిజర్వేషన్ ఫలాలు ఉప కులాలకు లబ్ధి చేకూరేలా అధ్యయనం చేయాల్సిందిగా అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ పి.రామచంద్రరాజు అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. లోతుగా అధ్యయనం చేసిన కమిషన్.. చివరకు తన నివేదికలో నాలుగు గ్రూపులుగా వర్గీకరించాలని సిఫారసు చేసింది. సమాజంలోని ఆర్థిక, సామాజిక వెనకబాటుతనం, జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్ ఫలాలు అందాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ సిఫారసులకు అనుగుణంగా 2000-2004 మధ్యకాలంలో వీటి అమలుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా మాలలు కౌంటర్ ఆందోళనను మొదలుపెట్టడంతో ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడింది. చివరకు ఇది సుప్రీంకోర్టుకు చేరింది. ఎస్సీ వర్గీకరణ విధానాలను అమలుచేయవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగ సవరణలు జరిగిన తర్వాత మాత్రమే ఇది సాధ్యమవుతుందంటూ స్పష్టత ఇచ్చింది. అయితే ఇన్ని అసమానతలు ఉన్న ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన తేనె తుట్టని ఇప్పుడు బీజేపీ మళ్లీ తెరపై తీసుకొచ్చింది.. తెలంగాణలో ఎలాగైనా పాగా వేయాలని చూస్తున్న బీజేపీ అస్త్రశస్త్రాలను ఒడ్డుతోంది. బీసీ నినాదంతో ముందుకు వెళ్తున్న బీజేపీ ఇప్పుడు దళిత సమాజాన్ని కూడా దగ్గర చేసుకునే పనిలో భాగంగా పెద్ద నిర్ణయం తీసుకుంది. అసలు బీజేపీకి అగ్రకుల పార్టీగా చాలా రోజుల నుంచి కూడా ఒక పేరు ఉంది. మనువాద పార్టీగా పేరొందిన బీజేపీ ఆ ముద్రను తొలగించుకునేందుకును ఎస్సీ వర్గీకరణ ద్వారా ఆ సమాజాన్ని దగ్గర చేసుకోవాలనుకుంటోంది. తెలంగాణ విషయంలో కచ్చితంగా వర్కౌట్ అవుతుందని భావిస్తోంది. బీజేపీ ఆంధ్రాలో ఎస్సీ వర్గీకరణ అంశానికి సంబంధించి నష్టం జరిగినా తెలంగాణలో ఇదే అంశాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోంది. తెలంగాణలో ఉన్న 18 శాతం ఎస్సీలలో 70 శాతం మంది %ం౩% ఉప కులాలు ఉన్నాయి. ఈ ఎస్సీ వర్గీకరణ అంశం ద్వారా పూర్తిస్థాయిలో ఆ సామాజిక వర్గాన్ని ప్రసన్నం చేసుకోవచ్చన్న భావన బీజేపీలో ఉంది. అందుకే ఈ స్టెప్ తీసుకున్నట్టుగా తెలుస్తోంది. అయితే అటు విపక్షాల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత అయితే దీనిపైన వ్యక్తం అవుతుంది. ఇన్ని రోజులు అధికారంలో ఉన్న పార్టీ ఎందుకు ఈ నిర్ణయం తీసుకోలేదని మళ్లీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు కూడా లేకపోలేదు. కానీ పసుపు బోర్డు ఇతర అంశాల విషయంలో ప్రధాని చెప్పిన తర్వాత ఆ నిర్ణయాలు జరిగిపోయాయి కాబట్టి కచ్చితంగా ఈ విషయం పై కూడా ప్రధాని మాట్లాడిన తర్వాత దళిత సమాజంలోకి వెళ్లింది. మరి ఇది ఓటుగా మారడానికి ఎంతలా ఉపయోగపడుతుంది.? బీజేపీ విజయానికి ఎంతలా తోడ్పడుతుంది.? అనేది వేచి చూడాలి.